క్లుప్తంగా

'అదానీతో చేసుకున్న ఒప్పందం రద్దు చేయాలి'



గోపాలపట్నం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

గోపాలపట్నం: ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యలు తక్షణం నిలిపి వేయాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, ట్రూఅప్ సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు శనివారం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గోపాలపట్నం జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు మాట్లాడుతూ చడీ చప్పుడు లేకుండా అదానీ మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. ఈ మీటర్ల వల్ల ప్రజలపై భారం పెరుగుతుందని తెలిపారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు మాట తప్పి పెనుభారం మోపుతున్నారని ఆరోపించారు. రూ. 449 కోట్ల ట్రూడౌన్ ద్వారా చార్జీలు తగ్గిస్తామని చెప్పి రూ.12,771 కోట్ల భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉరుకూటి రాజు, ఎ. గోవిందరావు, ఎస్. విజయలక్ష్మి, పి. అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: స్థానిక రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సంఘ గౌరవ అధ్యక్షుడు గొల్లమాల అప్పారావు అన్నదానం చేశారు. సుమారు 500 మందికి అన్నదానం జరిపామని, మహిళలకు చీరలు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, వీటిలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు అప్పారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి వెంకటరావు, భీర భైరవమూర్తి, బొత్స అప్పారావు, టేకి గణేష్, అన్ను సుబ్రమణి, నీళ్ల గణేష్, ధనాల అప్పారావు, కొణతాల ప్రేమానందం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


ధరల నియంత్రణకు చర్యలు



వర్తక సంఘం సభ్యులు, ఈవోలతో మాట్లాడుతున్న శ్రీనివాస్ కిరణ్

గోపాలపట్నం: రైతుబజార్లలో కాయగూరల ధరల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని, ఇందుకు రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు సహకరించాలని మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్ కిరణ్ కోరారు. ఈ మేరకు గోపాలపట్నం మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో విశాఖ పరిధిలో ఉన్న రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు, హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వినియోగదారుల కొనుగోలుకు వీలుగా ధరలు తగ్గించి అందించాలన్నారు. ధరలు ఎక్కువగా ఉన్న వస్తువులపై కొంత లాభం తగ్గించుకుని అమ్మకాలు సాగించాలని సూచించారు. ధరల విషయంలో అటు రైతులు ఇటు హోల్‌సేల్ వ్యాపారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ల ఈవోలు, హోల్‌సేల్ వర్తక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సీఎండీ గిరిదీప్ సింగ్‌కు శాలువా కప్పుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

మల్కాపురం: హిందుస్థాన్ షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా బాధ్యతలు స్వీకరించిన కమడోర్ గిరిదీప్ సింగ్‌ను శనివారం సంస్థ టీఎన్‌టీయూసీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ అభివృద్ధికి అంతా సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సీఎండీకి పలు సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఇరుకు రోడ్లతో.. ఇక్కట్లు

- పారిశ్రామికవాడ కొండవాలు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సుల కష్టాల పయనం
- విశాలమైన మార్గాల్లో అనధికార వాహనాల పార్కింగ్‌తో అవస్థలు
- నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు



ఇందిరా కాలనీ వాకింగ్ పార్కు మలుపు వద్ద ఇరుకు రోడ్డులో ఎదురెదురుగా వచ్చి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు



జై ఆంధ్రా కాలనీ డబుల్ ట్యాంక్ వద్ద మలుపు తిప్పేందుకు ఇబ్బంది పడుతున్న డ్రైవర్



జనతా కాలనీలో అడ్డంగా కారు పార్కింగ్

మల్కాపురం: కొండ వాలు ప్రాంత ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం నడుపుతున్న ఆర్టీసీ బస్సులు ఆ మార్గాల్లో రాకపోకలు సాగించలేక పలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో ఆర్టీసీ డ్రైవర్లు ఆ మార్గం దాటి బయటికి వచ్చిన వెంటనే హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటున్నారు.

కొండవాలు ప్రాంతాల్లో కష్టాల పయనం..

పారిశ్రామిక ప్రాంతంలోని 60,61,62,63 వార్డుల పరిధి కొండ ప్రాంతాల్లో సుమారు 20 వేల మంది వరకు జనం నివసిస్తున్నారు. అయితే వారికి తమతమ ప్రాంతాల నుంచి నేరుగా బయటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. వీరిలో చాలా మంది రోజువారీ కార్మికులతో పాటు వివిధ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, విద్యార్థులు, సొంత పనుల నిమిత్తం నగరానికి లేదా గాజువాక వెళ్లేవారు ఉంటారు. 60వ వార్డు కొండవాలు ప్రాంతాలైన ఇందిరా కాలనీ-1,2, బర్మా కాలనీ, అశోక్‌నగర్ తదితర ప్రాంత వాసులు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో గల శ్రీహరిపురం లేదా కోరమాండల్ బస్టాప్‌ల వద్దకు వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోంది. అలాగే 61, 62 వార్డుల పరిధిలోని కొండవాలు ప్రాంతలైన జనతా కాలనీ, అచ్చినాయుడులోవ, టీడీపీ కాలనీ, ప్రకాష్‌నగర్, త్రినాథ్‌పురం, ఏఎస్ఆర్ కాలనీ తదితర కొండ వాలు ప్రాంత వాసులు మల్కాపురం లేదా పోర్టు క్వార్టర్స్ బస్టాప్‌ల్లో బస్సులు ఎక్కాలి. అలాగే 63వ వార్డు కొండవాలు ప్రాంతాలైన జైఆంధ్ర కాలనీ, కాకరలోవ, చింతలోవ తదితర ప్రాంత వాసులు సింధియా లేదా న్యూకాలనీ బస్టాప్‌ల వద్దకు వెళ్లి బస్సులు ఎక్కే పరిస్థితి నెలకొని ఉంది.

ఇరుకు మార్గంతో అవస్థలు..

వీరి ఇబ్బందులను గుర్తించిన గాజువాక ఆర్టీసీ డిపో యాజమాన్యం పదేళ్ల క్రితం 38జె సర్వీస్‌ను ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి జనతా కాలనీ వరకు ఏర్పాటు చేసింది. అయితే ఇందిరాకాలనీ వాకింగ్ పార్కు మలుపు వద్ద రోడ్డు ఇరుగ్గా ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకొలేని పరిస్థితి నెలకొని ఉంది. ఇక జనతాకాలనీ సేవా మార్గం విశాలంగా ఉన్నప్పటికీ ఆ మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాలు అడ్డంగా నిలిపి ఉంచడం వల్ల ఆ మార్గం నుంచి బస్సులు సులువుగా ప్రయాణించే వీలు లేకుండా పోతోంది. అలాగే ప్రకాష్‌నగర్ నుండి టీడీపీ కాలనీకి వెళ్లే మార్గం ఇరుగ్గా ఉంటుంది. ఇక త్రినాథ్‌పురం మార్గం విశాలంగా ఉన్నప్పటికీ మార్గానికి ఇరువైపుల దుకాణాలు, వివిధ వాహనాలు అడ్డంగా ఉండటం వల్ల ఈ మార్గంలో బస్సు ప్రయాణం కూడా సాఫీగా సాగడం దుర్లభంగా మారింది. అలాగే జై ఆంధ్రా కాలనీ మార్గం కూడా ఇరుగ్గా ఉండడం వల్ల ఆర్టీసీ బస్సుల రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. పొరపాటున ఆర్టీసీ బస్సు ఎవరికైనా లేదా రోడ్డుకు అడ్డంగా పార్కు చేసిన ఏ వాహనానికైనా తగిలితే అదొక సమస్య అయి కూర్చుంటుంది. ప్రజా సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలది. ఆ దిశగా ఆలోచించిన వారు అక్కడ కనిపించడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

సెయింట్ జోసెఫ్‌లో బహుభాషా జర్నల్ ఆవిష్కరణ



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రతిష్టాత్మకమైన బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్ ఆవిష్కరించారు. 'తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతల సాహితీ కృషి' అనే అంశంపై ద్వితీయ భాషా విభాగం అధ్యక్షులు, హిందీ ఆచార్యులు డాక్టర్ పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ జర్నల్ రూపొందింది. తెలుగు, సంస్కృత, ఇంగ్లీష్, హిందీ భాషలలో 55 మంది అధ్యాపకులు రచించిన వ్యాసాలతో రూపొందించిన 'బహుళ శోధ్ మంజూష' బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ నిర్మల, డి.కోటేశ్వరరావు, రోజీనా, సుధాప్రియ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న నితీష్ చంద్ర

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని పాండురంగాపురానికి చెందిన కావూరి నితీష్ చంద్ర రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు.

మోసం చేయడమే బాబు నైజం



మాట్లాడుతున్న పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్



కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, ప్రజలు

- సూపర్ సిక్స్ అమల్లో కూటమి విఫలం
- నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్
- 90వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

విశాఖ విద్య: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ ప్రసాద్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు రెడ్డివీధి రామాలయం సమీపంలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమల్లో విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు.

ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ

కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని.. వారికి అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే టీడీపీ నాయకులు సిగ్గు లేకుండా ఎదురు దాడి చేస్తున్నారన్నారు. ప్రజల కోసమే వైఎస్సార్‌సీపీ పని చేస్తుందని చెప్పారు. ఎన్నికల ముందు కూటమిగా ఇచ్చిన మేనిఫెస్టో అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. తల్లికి వందనం పిల్లలు అందరికీ ఇచ్చేశామని ప్రకటించినా, చాలా మందికి ఇంకా డబ్బులు పడలేదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఏడాదికి రూ. 18 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోసం చేసినట్లు కాదా..అని ప్రశ్నించారు. ఏడాదికి మూడు గ్యాస్ బండలు ఎవరికి ఇచ్చారో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా నేరుగా ఇళ్లకు పంపించిన ఘనత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు.

విద్య, వైద్య రంగాలు నిర్లక్ష్యం

సమాజాభివృద్ధికి కీలకమైన విద్య, వైద్య రంగాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోవడంతో పేదలకు ఉచిత వైద్యం అందడం లేదన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని చెప్పి, స్మార్ట్ మీటర్లు పేరుతో పేద ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. ఇలాంటివి అడిగిన వారిపై అన్యాయంగా కేసులు పెడుతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం అమలు చేయక పోవడంతో ఫీజులు కట్టలేక పేద విద్యార్థులకు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రతీ ఒక్కరూ ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు.

దాచుకోవడం.. దోచుకోవడమే మీ లక్ష్యమా?

కూటమి ఎమ్మెల్యేలు ప్రజల కోసం కాకుండా వారి స్వార్థం కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. అధికారం పేరుతో దోచుకోవడం, దాచుకోవటం లక్ష్యంగా పని చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు ప్రజల్లోకి వస్తున్నామన్నారు. వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాద రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్, పశ్చిమ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు యల్లపు వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు పటాన్ సంసద్ బేగం, వార్డు మహిళా విభాగం అధ్యక్షురాలు సత్యవతి, సన్యాసిరావు, సత్యవతమ్మ, జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి బోర అప్పలరెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ బాల భక్త సేవా సంఘం అధ్యక్షుడు పురెడ్డి చంటి ఆధ్వర్యంలో మళ్ల విజయ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రజా సంఘాల నిరసన



స్మార్టు మీటర్లను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు

మల్కాపురం: స్మార్టు మీటర్లు మాకు వద్దు.. అదానీ స్మార్టు మీటర్లు తిప్పి పంపండి అంటూ శనివారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు మల్కాపురం సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. సీఐటీయూ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అదానీ విద్యుత్ స్మార్టు మీటర్లు బిగిస్తే ప్రతి నెలా ప్రజలపై భారం తప్పదన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీలతో ఇబ్బంది పడుతున్న ప్రజల నెత్తిన స్మార్టుమీటర్లు పెట్టి ఆర్థిక ఇబ్బందులకు గురి చేయవద్దని నినదించారు. పెంచిన కరెంట్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. స్మార్టు మీటర్ల అంశంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీపై నిలబడాలన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని ఊదరగొట్టిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేస్తున్నారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇదే పరిస్థితి ఉంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంటారావు,ఆర్.లక్ష్మణమూర్తి,ఎ.సత్యారావు,ఐద్వా నాయకురాలు బి.మమత, ఆర్.విమల,వై.కళ్యాణి,ఎం.జయలక్ష్మి,ఎస్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీల మోత



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడానికి, స్మార్ట్ మీటర్లు బిగించడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ కంచరపాలెం జోన్-2 ఏపీఈపీడీఎల్ విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో కంచరపాలెం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్, సీపీఎం నాయకురాలు బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు బాదుడే-బాదుడు అని నినాదాన్ని ఎత్తుకుని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు చేయడానికి వస్తే ప్రజలు వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారని తెలిపారు. ఇప్పుడు అదే పని చేయడానికి చూస్తున్న చంద్రబాబు, లోకేష్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి 15 నెలల పాలనలో నాలుగు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ఆ భారాన్ని ప్రజలపై మోపిందని తెలిపారు. విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈ జి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సానబోయిన అప్పలరాజు, ఒమ్మి అప్పారావు, సానబోయిన సోమేశ్వరరావు, డి.రామారావు, ఎం.ఈశ్వరరావు, బి.సింహాచలం, పి.మూర్తి, ఎం. కల్యాణి, పి.సత్య తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

కంచరపాలెం: విద్యార్థి దశ నుంచే సమాజంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కంచరపాలెం పోలీస్ స్టేషన్ ట్రైనీ ఎస్ఐ అజయ్ అన్నారు. రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పిల్లల అక్రమ రవాణా, పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశాలపై పాఠశాల హెచ్‌ఎం పి.చంద్రశేఖర్ నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ చిన్న వయసులోనే సోషల్ మీడియాకు అలవాటు పడడం వల్ల తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఉంటాయన్నారు. యుక్త వయసులో ఏది మంచి, ఏది చెడు అని అర్థం చేసుకునే పరిణతి ఉండదని హానికరమైన కంటెంట్ నుంచి తమను తాము రక్షించుకునే పరిజ్ఞానం కూడా వారికి ఉండదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు మానసిక ఆరోగ్య సమస్యలకు, అనారోగ్యకరమైన శరీర సౌందర్య భావనలకు సులభంగా లోనవుతారని గుర్తు చేశారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెట్టుకోవద్దని, అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తెలియజేయాలని నేర్పించాలన్నారు. సోషల్ మీడియాలో ఏం చూస్తున్నారో, ఏం చేస్తున్నారో గమనించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో చైన్ స్నాచింగ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సెక్టార్-12లో శనివారం ఉదయం మహిళ మెడ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం చైన్ లాక్కుని పారిపోయారు. వివరాలిలా .. 163బి క్వార్టర్‌లో నివాసముంటున్న కర్రి ఉమాదేవి ఉదయం ఆ సెక్టార్‌లో వాకింగ్ చేస్తున్నారు. స్కూటీపై వచ్చిన ఇద్దరు యువకులు వచ్చి ఆమె మెడలోని రెండు వరుసల చైన్‌ను తెంపేందుకు ప్రయత్నించారు. దీంతో ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో సుమారు రెండు తులాల బరువు కలిగిన సగం చైన్ దుండగుల చేతికి చిక్కింది. మిగిలినది ఆమె చేతిలో మిగిలింది. ఆమె అరవడంతో దుండగులు స్కూటీపై పారిపోయారు. బాధితురాలు స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ముళ్ల పొదల్లో మృతదేహం



ముళ్లపొదల్లో లభ్యమైన మృతదేహం

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ముళ్ల పొదల్లో మృతదేహం లభ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజీవ్‌నగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి పక్కన గల తుప్పల్లో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నట్టు దువ్వాడ సెక్టార్ -1 సచివాలయానికి సమాచారం వచ్చింది. దీంతో వీఆర్వో మడక పరమేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి పేరు మనోజ్ అని, 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని వీఆర్వో ఫిర్యాదులో పేర్కొన్నారు. 20 ఏళ్లుగా రాజీవ్‌నగర్ ప్రాంతంలో బిక్షాటన, చిత్తు కాగితాలు ఏరుకొంటూ జీవనం సాగిస్తున్నాడని ఆయన వివరించారు. అలాగే ఆయన ఒరియా మాట్లాడుతుంటాడని స్థానికులు తెలిపారని ఫిర్యాదులో పొందుపరిచారు. అయితే మృతుడి ముఖం, వీపు పైన గాయాలు ఉండడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. కాగా మృతుడి ఒంటిపై గాయాలు ఉండడంతో హత్య అయి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యంగా తిరిగే ఆ వ్యక్తి అకస్మాత్తుగా తుప్పల్లో ఎలా లభ్యమయ్యాడన్న విషయం ఎవరికీ అంతుపట్టడం లేదు. పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు.

ఎంఎస్‌ఎంఈకి ప్రభుత్వ స్థలం కేటాయింపు



భూకేటాయింపు పత్రాలను ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు అందిస్తున్న తహసీల్దార్ రమేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో ఎంఎస్ఎంఈ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వ భూమి 1.45 సెంట్లను ఏపీఐఐసీకి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ప్లాటెడ్ ఫ్యాక్టరీ ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు దోహదపడుతుందని అన్నారు. నిరుద్యోగ యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉపయోగపడుతుందని అన్నారు. గోపాలపట్నం తహసీల్దార్ రమేష్ చేతుల మీదుగా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం భూకేటాయింపు పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేష్, బొడ్డేటి విజయ్, నారిపిన్ని సత్తిబాబు,అరుణ్, కంపర ఆనంద్, నందవరపు సోములు తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ అమలు చేయాల్సిందే..

గాజువాక: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బెల్ కార్మికులకు హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంస్థ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భెల్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఇతర పరిశ్రమలకు సంబంధించిన పలు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా భెల్ సీఐటీయూ నాయకుడు జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఈపీఎఫ్-95 హయ్యర్ పెన్షన్‌ను ఇతర యూనిట్లలో అమలు చేస్తున్నారన్నారు. ఇక్కడ యాజమాన్యం, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తున్నాయన్నారు. వివిధ సిరీస్‌లకు చెందిన కార్మికుల జాయింగ్ తేదీలను సరి చేసి హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పీఎఫ్ ట్రస్టు కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐఎన్‌టీయూసీ నాయకుడు సీతన్న నాయుడు మాట్లాడుతూ కార్మికులను కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారా హయ్యర్ పెన్షన్ సాధించామన్నారు. ఇక్కడ హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయకపోవడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన కార్మిక నాయకులు ఎస్.ప్రసాద్, దీనబంధు, ఎస్.జగన్నాథరావు, అల్లం వెంకటేశ్వరరావు, ఎస్.అప్పలరాజు, యుఎంకే ఆచారి, ఎస్.సహబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.